ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
5
శుక్రవారం 26 జూలై 2024



రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మోమిన్‌పేట్, జూలై 25 : కొత్తగా పట్టా పాస్‌బుక్‌లు పొందిన రైతులు ఆగస్టు 5లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో జయశంకర్ తెలిపారు. గురువారం మోమిన్‌పేట్ రైతు వేదికలో దరఖాస్తులను స్వీకరించారు. అలాగే రైతు బీమా నమోదులో ఏవైనా మార్పులు, చేర్పులు చేసుకోవాలనుకునే వారు ఈ నెల 30కల్లా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు భూపతి, జయశంకర్, పెంటయ్య, చంద్రిక, మౌనిక, మనీషా పాల్గొన్నారు.

రాష్ట్ర శాసనసభలో గురువారం ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉమ్మడి జిల్లా రైతాంగానికి ఊరట కలిగించేలా ఉంది. ఎక్కువగా వ్యవసాయ రంగాలకు నిధులు కేటాయించడం ఉమ్మడి జిల్లా రైతులకు కలిసి రానుంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, కోట్‌పల్లి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు జరిగింది. ఇటీవల కాలంలో కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఎక్కువ నిధులు కేటాయించడం ఇదే తొలిసారి. ఇక శివారు ప్రాంతాల్లో శాటిలైట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేయనుండడం కలిసి వచ్చే అంశం. సొంతింటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇచ్చేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో ఇల్లులేని పేదలకు ఒక గూడు ఏర్పాటు చేసుకునేందుకు వీలు కలుగుతుంది. దీంతో వేలాదిమంది సొంతింటి వారు కానున్నారు.





పాలమూరుకు రూ.2000 కోట్లు

రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపు

- కోట్‌పల్లి ప్రాజెక్టుకు రూ. 10కోట్లు
- బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట
- అనంతగిరికి పర్యాటక సొబగులు
- సాగు భూములకే రైతు భరోసా
- రైతు కూలీలకు రూ.12,000
- శివార్లలో శాటిలైట్ టౌన్‌షిప్‌లు
- పెన్షన్ల పెంపు ప్రస్తావనే లేదు
- ఎయిర్‌పోర్టు వరకే మెట్రో
- ఫార్మాసిటీ ఊసే లేదు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/ వికారాబాద్)

కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో వ్యవసాయ, సంక్షేమ బాట పట్టింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో పూర్తిస్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా పలు స్కీమ్‌లకు నిధులు కేటాయించినప్పటికీ కొన్ని స్కీమ్‌ల ప్రస్తావన బడ్జెట్‌లో లేదు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చారు. మహిళలు, రైతులతో పాటు వివిధ వర్గాల వారికి సంక్షేమ పథకాల కింద భారీగా నిధులు కేటాయించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15వేలు ఇవ్వనున్నట్లు మంత్రి ప్రకటించారు. గత ఎన్నికల్లో రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ. 15వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, అనర్హులకు రైతు భరోసా ఇవ్వబోమని, వ్యవసాయం చేసే రైతులకే పెట్టుబడి సహాయం అందిస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ మాట ఇస్తే శిలాశాసనమని గతంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందిస్తామని తెలిపారు. ఇదిలా ఉంటే వ్యవసాయం లేని రైతు కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ. 1,200 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నారు. దీంతో ఉమ్మడి జిల్లాలో లక్షలాది కుటుంబాలకు మేలు జరగనుంది. వరి సాగు చేసే రైతులకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద రైతులు చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించనుందని ప్రకటించారు. ఇక ఉమ్మడి జిల్లా వాసులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు చెప్పినప్పటికీ ఈ ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ. 2వేల కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతో ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి మరి కొన్నేళ్లు పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో ఉమ్మడి జిల్లాలో కొంత మేర పనులు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు కింద ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టలేదు. తాజా బడ్జెట్‌లో పెన్షన్ల పెంపుపై ప్రస్తావన లేదు. గత ఎన్నికల్లో పేద వర్గాలకు అందించే పెన్షన్లు రూ. 4వేలకు మించి పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అలాగే ఎక్కడా ఫార్మాసిటీ ఊసే లేదు. గతంలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఒకేచోట ఫార్మాసిటీ ఏర్పాటుకు బదులు ఫార్మా క్లస్టర్ల ఏర్పాటు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.

సొంతింటి కలకు రూ.5లక్షలు

పేదలకు సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన వారికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణాల కోసం ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల చొప్పున అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఈ ఏడాది ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తామని బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. అలాగే పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు పంపిణీ చేస్తామన్నారు. అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

పర్యావరణ పర్యాటకంగా అనంతగిరి

తెలంగాణ ఊటీగా పేరొందిన అనంతగిరి కొండలను పర్యావరణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో పర్యావరణ పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు ఏడు అటవీ ప్రాంతాలను ఎంపిక చేయగా, దాంట్లో అనంతగిరి సర్క్యూట్ ఒకటి. పర్యావరణ పరిరక్షణతో పాటు రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూరేలా పర్యావరణ పర్యాటకాన్ని అభివృద్ధి పరచనున్నారు. కొండలు, గుట్టలు, చెట్లు, జలపాతాలు, వన్యజీవులు, జలాశయాలకు నష్టం జరగకుండా అటవీ సంపదను పరిరక్షించుకుంటూ మరింత విస్తృత పరిచేలా చర్యలు తీసుకోనున్నారు. అటవీ పరిరక్షణ, అభివృద్ధికి దోహదపడే విధంగా పర్యావరణ పర్యాటక రంగాన్ని విస్తృత పరచనున్నారు. ఒడిశా, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతుల్లో ఉత్తమ విధానంతో ఎకో టూరిజం పాలసీని రూపొందించి అమలు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో వివరించారు. అనంతగిరిని పర్యావరణ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరిస్తే స్థానికంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడనున్నాయి.

శివార్లలో శాటిలైట్ టౌన్‌షిప్‌లు



నగర శివార్లలో అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా శాటిలైట్ టౌన్‌షిప్‌లు నిర్మిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. తక్కువ ధరలకే పేద, మధ్య తరగతి వర్గాల వారికి అనుకూలమైన నివాస గృహాలు నగరం చుట్టూ నిర్మిస్తామని తెలిపారు. అలాగే రీజినల్ రింగు రోడ్డుకు రూ. 1,525 కోట్లు కేటాయించారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు రూ. 1,500కోట్లు, ఔటర్ రింగురోడ్డుకు రూ. 200 కోట్లు కేటాయించారు. మూసీ రివర్ ఫ్రంట్ పనులకు నిధులు కేటాయించడంతో శివార్లలో మూసీ సుందరీకరణ పనులు ఊపందుకోనున్నాయి.



శంషాబాద్ వరకు మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు

శంషాబాద్ వరకు మెట్రోలైన్ విస్తరణ చేపట్టనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఓల్డ్ సిటీని అనుసంధానిస్తూ శంషాబాద్ వరకు మెట్రో పనుల విస్తరణకు రూ.100కోట్లు కేటాయించారు. అలాగే నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ లైన్ కూడా అనుసంధానిస్తున్నట్లు తెలిపారు. గతంలో హామీ ఇచ్చిన మేరకు మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు, ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మెట్రో విస్తరణ చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అయితే గతంలో సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు మెట్రోను కందుకూరు వరకు విస్తరిస్తామని ప్రకటించారు. కానీ ఈ బడ్జెట్‌లో ఈ విషయం ప్రస్తావనే లేదు. ఇక హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు కలిపి విపత్తుల నిర్వహణ సంస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

కోట్‌పల్లి ప్రాజెక్టుకు నిధుల వరద



వికారాబాద్ జిల్లాలో ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు కోట్‌పల్లికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్లు కేటాయించింది. చాలా సంవత్సరాలుగా కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులకు నోచుకోవడం లేదు. కాలువలు, తూములు శిథిలావస్థకు చేరాయి. ఇటీవల కాలంలో కోట్‌పల్లి ప్రాజెక్టుకు ఎక్కువ నిధులు కేటాయించడం ఇదే తొలిసారి. ప్రాజెక్టు నిర్వహణ, మరమ్మతు పనుల కోసం రూ.25 లక్షల నుంచి రూ. 50లక్షల వరకు కేటాయింపులు చేసేవారు. అయితే ఈసారి కోట్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులు, నిర్వహణ తదితర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.10 కోట్లు, భవన నిర్మాణాల కోసం మరో రూ.28 లక్షలు కేటాయించింది. కోట్‌పల్లి ప్రాజెక్టును ఆధునీకరించి పూర్తిస్థాయిలో ఆయకట్టుకు నీరందించేందుకు ఇటీవల రూ.110 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అంతే కాకుండా ఇరిగేషన్ డివిజన్, సబ్ డివిజన్ కార్యాలయాల నిర్మాణానికి రూ.1.54 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనల నివేదికను ప్రభుత్వానికి పంపించిన విధితమే. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కోట్‌పల్లి ప్రాజెక్టుకు రూ.10 కోట్లు, భవన నిర్మాణాలకు రూ.28 లక్షలు కేటాయించింది.

రంగారెడ్డి జిల్లాకు అన్యాయం



రాష్ట్రానికి అత్యధిక ఆదాయాన్ని సమకూర్చిపెట్టే రంగారెడ్డి జిల్లాకు బడ్జెట్ కేటాయింపులో అన్యాయం జరిగింది. సీఎం సొంత నియోజకవర్గానికి భారీగా నిధులు కుమ్మరించుకుని పక్కనే ఉన్న రంగారెడ్డి జిల్లాపై శీతకన్ను పెట్టారు. కూరగాయలజోన్ గురించి స్వయంగా సీఎం ప్రకటించినా ఫలితం లేదు. మొత్తంగా రంగారెడ్డి జిల్లాకు ప్రయోజనం శూన్యం

- బొక్క నర్సింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు, రంగారెడ్డి

పేదలకు ఆమోదయోగ్యం



రాష్ట్ర బడ్జెట్ పేద ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉంది. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, మౌలిక సదుపాయల కల్పనకు అనుగుణంగా ఉంది. ఎయిర్‌పోర్టుకు మెట్రో వేసేందుకు రూ.వంద కోట్లు, మూసీ అభివృద్ధి కోసం రూ.1,500 కోట్లు కేటాయించడం శుభ పరిణామం.

పాలమాకుల జంగయ్య,
సీపీఐ జిల్లా కార్యదర్శి, రంగారెడ్డి

ప్రజారంజక బడ్జెట్



ఇది పేదల బడ్జెట్. వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెద్దపీట వేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తుంది. విద్య, వైద్యం, విద్యుత్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి నిధులు కేటాయింపు జరిగింది. ఐటీ, నీటి పారుదల వంటి వాటికి బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయి.

- చల్లా నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, రంగారెడ్డి

విద్యారంగానికి అంతంత మాత్రమే



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొఠారి కమిషన్ నివేదిక ప్రకారం విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలి. కానీ.. కేవలం 7.31శాతమే కేటాయించింది. గత ఏడాది బడ్జెట్ 6.57 శాతంతో పోలిస్తే స్వల్పంగా పెరిగినట్లు కనిపించినా విద్యారంగానికి సరిపోయే నిధులు పెంచలేదు.

- ఏవీ సుధాకర్,
ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి

పెన్షన్ల పెంపు ప్రస్తావనే లేదు



పెన్షన్లపై పెంపు చేస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో దాని ప్రస్తావనే తేలేదు. తెల్లరేషన్‌కార్డు ఉన్న మహిళలకు 2,500 రూపాయలు పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం బడ్జెట్‌లో దాని గురించి ప్రస్తావించలేదు. కాంగ్రెస్ సర్కార్ మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. మహిళల అభివృద్ధికి నిధులు పెంచాలి.

- లంబ మంజుల, ఘట్‌కేసర్, మేడ్చల్

ప్రజాపాలనకు అద్దం



ఆర్థికమంత్రి భట్టి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాపాలనకు అద్దం పట్టే విధంగా ఉంది. అన్ని వర్గాలకు ప్రాధాన్యతను ఇచ్చేలా ఉంది. ప్రధానంగా వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారు. పాత అప్పులు చెల్లిస్తూనే సంక్షేమ పథకాలపై భారీగా నిధులు కేటాయించింది.

-టి.రామ్మోహన్‌రెడ్డి, వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే

విద్యకు కేటాయింపులు పెంచాలి



గత సంవత్సరం రూ.2,90,000 కోట్ల బడ్జెట్‌లో విద్యకు రూ.19,093 కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.21,292 కోట్లు కేటాయించారు. రూ.2,200 కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న 15శాతంలో సగానికి మించలేదు. ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ఈ కేటాయింపులు సరిపోవు. విద్యకు కేటాయింపులు పెంచాలి.

- పి.మాణిక్‌రెడ్డి, ప్రధాన సంపాదకుడు, వాయిస్ ఆఫ్ తెలంగాణ

15ఏళ్ల లోపు పిల్లలకు జేఈ వ్యాక్సినేషన్

టీకా తప్పక వేయించాలన్న డీఎంహెచ్‌వోలు

వికారాబాద్/మేడ్చల్(ఆంధ్రజ్యోతి), జూలై 25 : జిల్లాలోని 15 సంవత్సరాల లోపు పిల్లలందరికీ జపనీస్ ఎన్సెఫాలిటిస్(జేఈ) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వికారాబాద్ వైద్యారోగ్య శాఖ అధికారి పల్వాన్ కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ మండలం సిద్ధులూరు పీహెచ్‌సీలో పిల్లలకు జేఈ వ్యాక్సినేషన్ వేసి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం నవాబ్‌పేట్, మోమిన్‌పేట, పట్లూర్, బంట్వారం పీహెచ్‌సీల్లో జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. తల్లిదండ్రులందరూ వారి పిల్లలకు జేఈ వ్యాక్సినేషన్ వేయించి పిల్లల మెదడు వాపు వ్యాధికి గురికాకుండా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ చేస్తున్న కృషికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య శాఖ అధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మెదడు వాపు వ్యాధి నివారణ వ్యాక్సినేషన్‌ను డీఎం హెచ్‌వో రఘునాథస్వామి, వైద్యులు శ్రీదేవి, మల్లీశ్వరి, సరస్వతిలతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బ్రెయిన్ ఫీవర్ అని పిలిచే ఈ వ్యాధి జపనీస్ ఎన్సెఫాలిటిస్(జేఈ) సోకిన దోమ కుడితే వస్తుందన్నారు. జిల్లాలో జేఈ టీకా ఆగస్టు 15 వరకు వేస్తామని తెలిపారు. ఈ వ్యాక్సిన్ 1 నుంచి 15ఏళ్ల పిల్లలకు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వేస్తామన్నారు. జిల్లాలో 9నెలలు నుంచి 15ఏళ్ల పిల్లలు 4,86,037 మంది ఉన్నట్టు గుర్తించామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఈ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.



జేఈ వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్



వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న మేడ్చల్ డీఎంహెచ్‌వో రఘునాథస్వామి

ఆకాశమే హద్దుగా!

తలసరి, స్థూల ఉత్పత్తిలో రంగారెడ్డి 'టాప్'

- అత్యధికంగా రూ.9.46,862 తలసరి ఆదాయం
- నాలుగో స్థానంలో మేడ్చల్ జిల్లా
- అట్టడుగున వికారాబాద్



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో రంగారెడ్డి జిల్లా ఆకాశమే హద్దుగా దూసుకుపోతోంది. రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న జిల్లాగా రంగారెడ్డి కొనసాగుతోంది. జాతీయ తలసరి ఆదాయానికి అయిదు రెట్లు అదనంగా రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం ఉండడం గమనార్హం. శాసనసభలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా తెలంగాణ సామాజిక, ఆర్థిక సర్వే -2024ను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. రూ.9.46,862 తలసరి ఆదాయంతో రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఆ తరువాత రూ. 4,94,033తో హైదరాబాద్ రెండో స్థానంలో ఉండగా 2,95,514 తలసరి ఆదాయంతో మేడ్చల్ నాలుగో స్థానంలో ఉంది. అయితే ఉమ్మడి జిల్లా నుంచి వేరుపడిన వికారాబాద్ జిల్లా రూ.1,80,241 తలసరి ఆదాయంతో రాష్ట్రంలో చివరి స్థానంలో ఉన్నాయి. పక్కపక్కనే ఉన్న రెండు జిల్లాల్లో అంతరాన్ని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ వెనుకబడిన జిల్లాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇక స్థూల ఉత్పత్తిలో కూడా రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. స్థూల ఉత్పత్తిలో మేడ్చల్ జిల్లా మూడో స్థానంలో ఉండగా వికారాబాద్ గతం కంటే కొంత మెరుగుపడి 21వ స్థానంలో నిలిచింది. రాష్ట్రానికి ఆర్థికంగా గుండెకాయగా ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతి ఏటా ఆర్థికాభివృద్ధిలో దూసుకుపోతోంది. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టు పక్కల భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ఈ ప్రాంతాలు ప్రభుత్వానికి భారీగా ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న సంగతి తెలిసిందే. అలాగే రిజిస్ట్రేషన్ల శాఖ, ఆబ్కారీ, రవాణ శాఖకు వచ్చే ఆదాయంలో సింహభాగం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచే వస్తోంది. నగర శివార్లలోని ఐటీ, ఫార్మా, ఇతర రంగాలకు చెందిన కంపెనీల ద్వారా రాష్ట్ర ఖజానాకు భారీగా నిధులు సమకూరుతున్న సంగతి విదితమే. ప్రతి ఏటా కొత్త కొత్త కంపెనీలు కూడా శివార్లలో కొలువు తీరుతున్నాయి. ఈ కారణంగా రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం, స్థూల ఉత్పత్తిలో దూసుకుపోతోంది.

తలసరి ఆదాయం ఇలా (జిల్లాల వారీగా)

జిల్లా	తలసరి ఆదాయం
రంగారెడ్డి	9,46,862
మేడ్చల్	2,95,514
వికారాబాద్	1,80,241

జిల్లా స్థూల ఉత్పత్తి (రూ.కోట్లలో)

జిల్లా	స్థూల ఉత్పత్తి
రంగారెడ్డి	2,83,419
మేడ్చల్	88,867
వికారాబాద్	19,840

కురుస్తున్న ముసురు

- పలు గ్రామల్లో కూలిన ఇళ్లు

వికారాబాద్/మర్పల్లి, జూలై 25 : వికారాబాద్ పట్టణంలో ఐదు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని ముసురుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వికారాబాద్‌లో వర్షంలోనే బోనాల ఉత్సవాలను నిర్వహించారు. ముసురు పడుతోంది తప్ప చెరువుల్లోకి నీరు రావడం లేదని రైతులు అంటున్నారు. వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు మర్పల్లి మండలంలోని కొన్ని గ్రామాల్లో ఏడు ఇళ్లు కూలిపోయాయి. కల్కొడలో మైను, రాజు, యాదవ్, సుజాత, కోట మర్పల్లికి చెందిన జంగం నాగేశం, గోవిందరెడ్డి, కొత్లాపురానికి చెందిన గొల్ల కిష్టయ్యల ఇళ్లు కూలిపోయాయి. ఇళ్లు కూలి తాము నిరాశ్రయులమయ్యామని వారు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు. రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు కురియనున్న నేపథ్యంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లలో ఉండొద్దని తహసీల్దార్ గణేశ్ ప్రజలకు సూచించారు.



కల్కొడలో వర్షానికి కూలిన ఇల్లు



నేదునూర్ మోడల్ స్కూల్ వరకు రోడ్డు వేయించాలి

కందుకూరు. జూలై 25 : మండలంలోని నేదునూర్ మోడల్ స్కూల్ వరకు రోడ్డు వేయాలని కోరుతూ గురువారం వందేమాతరం విద్యార్థి సేవా ఫోర్స్ అధ్యక్షుడు ఊటు మహేందర్ కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పాఠశాలకు బాలబాలికలు వస్తుంటారని, రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ డీఈవోకు ఫోన్‌చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించినట్లు మహేందర్ చెప్పారు.







వాణిజ్య అభివృద్ధికి జీఎంఆర్ ఏరోసిటీ చక్కటి వేదిక

- జీఎంఆర్ ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈవో అమన్‌కపూర్
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రీగస్ కార్యాలయం ప్రారంభం

శంషాబాద్ రూరల్, జూలై 25: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వాణిజ్య అభివృద్ధికి జీఎంఆర్ ఏరోసిటీ చక్కటి వేదిక అని జీఎంఆర్ ల్యాండ్ డెవలప్‌మెంట్ సీఈవో అమన్‌కపూర్ అన్నారు. గురువారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రీగస్ అధికారులతో కలిసి వర్క్‌స్పేస్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూప్రపంచంలో వాణిజ్యం అభివృద్ధి చెందడానికి అనువైన ప్రదేశాలు ఉండడం చాలా కీలకమని, అందులో జీఎంఆర్ ఏరోసిటీ ఒక్కటని చెప్పారు. దేశంలోని వివిధ వాణిజ్య రంగాలను అనుసంధానం చేయడానికి ఈ స్పేస్ ఎం తో ఉపయోగకరంగా మారుతుందన్నారు. వివిధ వాణిజ్య సంస్థలకు లీజుకు ఇచ్చే కార్యాలయాలతో పాటు ఒక రోజు, ఒక గంట సమయానికి సమావేశమయ్యేందుకు కావాల్సిన సమావేశపు గదులు కూడా ఇందులో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పర్యావరణ హితంగా, సౌకర్యవంతమైన వర్కింగ్ స్పేస్ అభివృద్ధితో రీగస్ సంస్థతో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అతిథ్యం, ఆరోగ్యం, సంరక్షణ, వినోదం, విద్య, పారిశ్రామిక పార్క్‌లతో సమీకృతంగా ఏరోసిటీ అభివృద్ధి చెందుతుందన్నారు. వాణిజ్య రంగాభివృద్ధి లో హైదరాబాద్ విస్తరణకు ఏరోసిటీ ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అన్నారు. ఐడబ్ల్యూజీ మేనేజర్ శ్రీహర్ష లాంబా మాట్లాడుతూ హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో మాకొత్త రీగస్ సెంటర్‌ను ప్రారంభించడం ద్వారా వాణిజ్య కార్యకలాపాలు మెరుగుపర్చుకున్నామని చెప్పారు. వ్యాపార కేంద్రంగా జీఎంఆర్ ఏరోసిటీ పేరుగాంచిందని, అందుకోసమే ఇక్కడ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించామని చెప్పారు. ఇక్కడ మా కార్యకలాపాలను మెరుగుపర్చుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు జీఎంఆర్ ప్రతినిధితుల బృందం, రీగస్ అధికారుల ప్రతినిధులబృందం పాల్గొన్నారు.



శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రీగస్ కార్యాలయాన్ని ప్రారంభించిన జీఎంఆర్, రీగస్ సంస్థల ప్రతినిధులు



తాండూరు పశుసంవర్ధక శాఖ ఏడీ ప్రభురాజ్ బదిలీ

ఆయన స్థానంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్



తాండూరు రూరల్, జూలై 25: తాండూరు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ ప్రభురాజ్ మేడ్చల్ జిల్లా హెడ్ క్వార్టర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో హైదరాబాద్ నగరంలోని నారాయణ గూడ పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తాండూరు పశు సంవర్ధక శాఖ ఏడీగా నియమితులయ్యారు. మరో రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక్కడ 14 సంవత్సరాలపాటు డాక్టర్ ప్రభురాజ్ సేవలందించారు. స్థానికంగా తాండూరులో ప్రజలకు అందుబాటులో ఉంటూ పశు సంవర్ధక శాఖలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందారు. ఆస్పత్రికి వచ్చిన మూగ జీవాలకు ఎన్నో చికిత్సలు చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న పశువులకు సకాలంలో వైద్యం అందించి కాపాడారు. ఆయన పశు వైద్య ఆస్పత్రిలో చేసిన సేవలు మరువలేనివని పాత తాండూరు, సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి ప్రాంత రైతులు కొనియాడారు.





ఇందిరానగర్‌లో బోనాలు సమర్పిస్తున్న కాలనీవాసులు

వైభవంగా బోనాలు

వికారాబాద్, జూలై 25: వికారాబాద్ పట్టణంలోని ఇందిరానగర్, శివరాంనగర్ కాలనీలో బోనాల పండుగను గురువారం వైభవంగా నిర్వహించారు. కాలనీలోని అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందిరానగర్ కాలనీలో కౌన్సిలర్ బొండల సువర్ణ అశోక్, గ్రామ పెద్దలు బొండల శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాలనీ వాసులు మహిళలు పాల్గొన్నారు.



మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

కొత్తూర్, జూలై 25: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని షాద్‌నగర్ ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణలు కోరారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశం హాల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతి పెద్ద నేరమన్నారు. మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు ఉద్యోగం, ప్రేమ పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారని గుర్తుచేశారు. మానవ అక్రమ రవాణాపై ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే అధికారులకు సమచారం అందించాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టులోని అంగన్‌వాడి టీచర్లకు అవగాహన కల్పించి, వారి ద్వారా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మీబాయ్, జ్యోతి, ప్రజ్వల సిబ్బంది అనిల్‌కుమార్, మిథాళిరాజ్, టీచర్లు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీడీపీవో నాగమణి, బలరామకృష్ణ

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

ఆమనగల్లు, జూలై 25: వానాకాలం పంటల సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి అరుణకుమారి తెలిపారు. ఎరువులు, విత్తన డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని ఎరువుల, విత్తన దుకాణాలను గురువారం ఏవో తనిఖీ చేశారు. రికార్డులను, విత్తన నిల్వలను, స్టాక్ బోర్డులను పరిశీలించారు. పంటలకు సరిపడా యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీలర్లు తదితరులు ఉన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఏవో అరుణకుమారి



అధ్వానంగా రోడ్లు



మర్పల్లి: గుంతలమయంగా మారిన కోట్‌పల్లి రోడ్డు

మర్పల్లి, జూలై 25: ఎడతెరిపి లేకుండా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రోడ్లు గుంతలుగా మారడంతో వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. రోడ్డుపై ఎక్కడ గుంత ఉందో తెలియని పరిస్థితిలో భయాందోళనతో ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్లను మరమ్మతు చేయాల్సిన అధికారులు చూపీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపించారు. మర్పల్లి నుంచి బుదెర, మర్పల్లి నుంచి కోట్‌పల్లికి వెళ్లేరోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి ఆ గుంతల్లో నీరు నిలిచి ఉంటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా మండలంలోని వివిధ గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్ల ఈ సమస్య తీరడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పరిగి: పరిగి మునిసిపల్ పరిధిలోని రోడ్లు ఆధ్వాన్నంగా మారాయి.ముసురు వర్షంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. వర్షం నీరు ఎక్కడబడితే అక్కడ నిలిచి రోడ్లు ఆధ్వాన్నంగా మారాయి. పరిగిలోని భవానీనగర్, తిరుమల వెంచర్‌లో రోడ్లు అధ్వాన్నంగా తయారై రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. షాద్‌నగర్ రోడ్‌లోని భవానీ, తిరుమల కాలనీల్లో వర్షానికి రోడ్లు దెబ్బతిని మట్టంతా రోడ్లపైకి రావడంలో రాకపోకలు ఇబ్బందికరంగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని బీజేపీ పట్టణ ఆధ్వర్యంలో గురువారం మునిసిపల్ కమిషనర్ వెంకటయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రాంచందర్, ఉపాధ్యక్షుడు వేముల పెంటయ్య, రాముయాదవ్,పరిగి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు జి.బాలకిష్టారెడ్డి, వార్ల అంజనేయులు మాట్లాడుతూ.. దెబ్బతిన్న రోడ్లను బాగు చేయడంలో మునిసిపల్ అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. గుంతలమయంగా మారి కనీసం నడువలేని స్థితిలో ఉన్నాయని తెలిపారు. మరమ్మతులు చేపట్టకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు టీవీ నర్సింహులు, బీజేపీ నాయకులు వాణి, కోళ్ళ నర్సింహులు, సౌందర్య, వై.రమేశ్, అనిల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి: భవానినగర్‌కు వెళ్లే రోడ్డు దుస్థితి

రోడ్డు దుస్థితిపై వాహనదారుల ఆందోళన

● ఎమ్మెల్యే ఆదేశంతో తక్షణమే మరమ్మతులు

తాండూరు: తాండూరు వికారాబాద్ ప్రధాన గీత మందిర్ సమీపంలో వర్షాలకు బీటీరోడ్డు కోట్టుకుపోయి పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను తీర్చాలని వాహనదారులు గురువారం రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈ విషయం సామాజిక మాద్యమాలు, స్థానికుల ద్వారా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి తీసుకెళ్లారు. ఈ మేరకు వెంటనే స్పందించిన ఆయన రోడ్డు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుట్టారు.



తాండూరు: ఎమ్మెల్యే ఆదేశంతో మరమ్మతులు చేపడుతున్న అధికారులు

క్రైం కార్నర్

మద్యం సీసాలో బల్లి

● తాగిన వారికి స్వల్ప అస్వస్థత ● వికారాబాద్‌లో ఘటన

వికారాబాద్, జూలై 25: ఇటీవలి కాలంలో తిను బండారాల్లో బొద్దింకలు, బల్లులు రావడం, ఈ-కామర్స్ పార్సిళ్లలో పాములు రావడం వంటి ఘటనలు తరచూ గమనిస్తూనే ఉన్నాం. మద్యం సీసాల్లోకి కూడా అవి చొరబడ్డ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. 'రాయల్ గ్రీన్' విస్కీ సీసాలో బల్లి రావడంతో ఆ సీసాలోని మద్యం తాగిన వారు స్వల్ప అస్వస్థతకు గురైన సంఘటన వికారాబాద్ జిల్లాలో కలకలం రేపింది. వికారాబాద్ పట్టణానికి చెందిన సందీప్ అనే యువకుడు ఎన్నెపల్లిలోని అనంతగిరి వైన్స్‌లో రాయల్ గ్రీన్ విస్కీ ఫుల్ బాటిల్‌ను ఈ నెల 22న సాయంత్రం 8గంటల సమయంలో కొన్నాడు. మిత్రులతో కలిసి సగం సీసా వరకు మద్యం తాగిన తరువాత చూడగా సీసాలో బల్లి కన్పించింది. దీంతో మద్యం తాగిన యువకులంతా నిశ్చేష్టులయ్యారు. బల్లి పడిన మద్యం తాగిన తమకు ఏమవుతుందోనని భయపడ్డారు. మరుసటి రోజు తెల్లవారుజామున వారంతా విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. స్వల్ప అస్వస్థతకు గురైనప్పటికీ మాత్రలు వేసుకొని కోలుకున్నారు. ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది. బ్రాండెడ్ మద్యం సీసాలోనే ఇలా బల్లి రావడం చూస్తే మద్యం తయారీదారులు ప్రజల ఆరోగ్యంపై ఎంత నిర్లక్ష్యంగా ఉంటున్నారో తెలుస్తోందని మద్యం ప్రియులు చర్చించుకుంటున్నారు. ఇలాంటివి జరగకుండా అధికారులు తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు.



మద్యం సీసాలో ఉన్న బల్లి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఘట్‌కేసర్ రూరల్, జూలై 25: రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన పోచారం ఐటీసీ పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం మునిసిపాలిటీ అన్నోజిగూడ డీమార్టు ముందు గుర్తుతెలియని వ్యక్తి(35) రోడ్డు దాటుతుండగా ఘట్‌కేసర్ నుంచి ఉప్పల్ వైపు వెళుతున్న వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. శరీర భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. మృతదేహం గుర్తుపట్టలేనిస్థితిలో ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సును పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్ టౌన్, జూలై 25: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గిర్మాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గిర్మాపూర్ గ్రామానికి చెందిన కుతాడి రమేష్(54) గురువారం గ్రామ శివార్లలోని ఓ చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు రమేష్ మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమితం గాంధీ మార్చురీకి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల కార్మికులతో పని చేయిస్తున్న కాంట్రాక్టర్‌పై కేసు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 25: బాల కార్మికులతో గృహనిర్మాణ పనులు చేయిస్తున్న ఓ కాంట్రాక్టర్‌పై పోచారం ఐటీసీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాజు వర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోచారం ఐటీసీ పోలీసు పరిధి డాక్టర్ కాలనీలో బాల కార్మికులు బండి ఉదయ్‌కుమార్(16), మల్లేల శాంతివర్ధన్(14)లతో గృహనిర్మాణ పనులు చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ముస్కాన్ ఆపరేషన్ టీం సభ్యులు దాడులు జరిపి పనులు చేస్తున్న ఇద్దరు బాలురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టిన ముస్కాన్ ఆపరేషన్ కమిటీ సభ్యులు ఇద్దరు బాలురిని జువైనల్ హోంకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

పరిగి, జూలై 25: టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల్లో కాలం చెల్లిన కూల్ డ్రింక్స్ లభ్యమయ్యాయి. వాటిని విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని గణేశ్ ట్రేడర్స్‌లో గురువారం తనిఖీలు నిర్వహిస్తే పల్ఫీజ్యూస్, సోడా, వాటర్ బాటిల్స్ కాలం చెల్లినవి విక్రయిస్తున్నట్లు గుర్తించామని పరిగి ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. వీటి విలువ రూ.30 వేలకుపైగా ఉంటుందని తెలిపారు. షాపు యజమాని వెంకటేశంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతీ విద్యార్థికి జేఈ వ్యాక్సిన్ తప్పనిసరి

మేడ్చల్ టౌన్, జూలై 25: ప్రతీ విద్యార్థికి జపనీస్ ఎన్సెఫాలిటిస్(జేఈ) వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని వైద్యాధికారులు తెలిపారు. మండలంలోని డబీల్‌పూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం మెదడువాపు వ్యాధి నివారణ టీకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చేపట్టి విద్యార్థులకు టీకాలు ఇస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

మర్పల్లి: మెదడువాపు వ్యాధి నివారణకు ప్రతీ విద్యార్థికి జేఈ వ్యాక్సిన్ వేస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి పల్వాన్‌కుమార్ తెలిపారు. మండలంలోని సిరిపూరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం మెదడు వాపు వ్యాధి నివారణ జేఈ వ్యాక్సిన్ టీకాలు వేశారు. పట్లూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలకు 6,645 మందికి టీకాలు వేస్తున్నట్లు తెలిపారు.



మేడ్చల్ టౌన్: విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

ఈ నెల 25 నుంచి వచ్చే నెల 7 వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్లూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి నేహ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: ప్రతీ విద్యార్థికి జేఈ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలని మండల వైద్యాధికారి సుజల జయ్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం జేఈ వ్యాక్సిన్ వేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, హెచ్‌ఎం ప్రభు, రమేశ్, ఏఎన్‌ఎం మంజుల, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కులకచర్ల: మెదడువాపు నివారణకు 15 సంవత్సరాల్లోపు విద్యార్థులకు జేఈ వ్యాక్సిన్ వేయించాలని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారిణి మాధురి తెలిపారు. బండవెల్కిచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో గురువారం 330 మందికి, బాలికల ఆశ్రమ పాఠశాలలో 440, ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో 280 మంది విద్యార్థులకు మెదడువాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రప్రకాశ్, వైద్యురాలు ప్రశాంతి, మనీష్‌కుమార్, సూపర్‌వైజర్ స్వరూప రాణి, యాదమ్మ, సిబ్బంది సుజాత, జంగమ్మ, మంగమ్మ, శ్రీలత, సుజాత పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

దోమ: మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా గురువారం 280 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం లాల్యానాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లో వర్షపునీరు లేకుండా చూసుకోవాలి

బషీరాబాద్, జూలై 25: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున రైతుల పొలాల్లో నీటినిల్వలు లేకుండా చూసుకోవాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. నీళ్లపల్లి, మర్పల్లి, మైల్వార్, ఇస్మాయిల్‌పూర్ గ్రామాల్లో గురువారం పర్యటించి క్షేత్రస్థాయిలో పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడున్న రైతులతో మట్లాడారు. వర్షాలకు అనుగుణంగా పంట యజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. అనంతరం కాశీంపూర్ రైతు వేదికలో రైతుల, ఏఈవోలతో సమావేశమై చర్చించారు. రైతుబీమాకు దరఖాస్తులు స్వీకరిస్తున్నందున కొత్తగా రైతులు ఎవరైనా ఉంటే ఈనెల 30లోపు క్లస్టర్ ఏఈవోలు ఇవ్వాలన్నారు. ఆయన వెంట ఏడీఏ రుద్రమూర్తి, ఏఈవో రాజ్‌కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

తాండూరు ప్రాజెక్టుల అభివృద్ధికి నిధులు



భారీ, మధ్య తరహా నీటి పారుదల ప్రాజెక్టుల అభివృద్ధికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చినందున తాండూరు నియోజకవర్గంలోని ప్రాజెక్టులన్నీ అభివృద్ధి చెందుతాయి. జిల్లాలో తాండూరు నియోజకవర్గంలో 25 ఎకరాల్లో మొదటి ఇంటి గ్రేటెడ్ హాస్టల్ ఏర్పాటు కానుంది. కోట్‌పల్లి, జుంటుపల్లి సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయించనున్నారు. నిలిచిపోయిన శివసాగర్ ప్రాజెక్టు పనులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. గ్రామపంచాయతీలకు భవనాల నిర్మాణాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించినందున కొత్త పంచాయతీలకు సొంత భవనాలను నిర్మిస్తామన్నారు. - బుయ్యని మనోహర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే

ఇది రైతుల బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతాంగానికి ఎంతో మేలు చేకూరే విధంగా ఉంది. గతంలో వైఎస్సార్ ప్రభుత్వం తప్ప ఏప్రభుత్వాలు రైతాంగం పట్టించుకోలేదు. తిరిగి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టింది.

- సుభాన్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు, తాండూరు

విద్యారంగానికి తీవ్ర అన్యాయం



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు, యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు శూన్యం. స్కిల్ యూనివర్సిటీ మండలానికి ఇంటర్నేషనల్ పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాల ఇంటిగ్రేటెడ్ గురుకుల ఊసేలేదు. దీనిపై శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతాం. గత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయించిన బడ్జెట్ కంటే తక్కువగా కేటాయించింది. నియోజకవర్గానికి ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఊసే లేదు.

- దీపక్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ తాండూరు డివిజన్ అధ్యక్షుడు

నవాంద్గీలో రైళ్ల నిలుపుదల అంశంపై లోక్‌సభలో ప్రస్తావన

బషీరాబాద్, జూలై 25: నవాంద్గీ(బషీరాబాద్) రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల అంశంపై చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గురువారం లోక్‌సభలో సభ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన లోక్‌సభలో స్థానికంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపకపోవడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సామాన్యులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తన గళం వినిపించారు. రైల్వే స్టేషన్‌మీదుగా వెళ్లే రైళ్లు ఆగకుండా పోవడంపై గత ఐదేళ్లుగా స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారంటూ సభలో తెలుగులో ప్రస్తావించడం విశేషం.

వైభవంగా ఫలహారబండి ఊరేగింపు

పరిగి, జూలై 25: పరిగి మునిసిపల్ పరిధిలోని పోచమ్మ తల్లి ఫలహారం బండి శోభయాత్ర గురువారం రాత్రి వైభవంగా జరిగింది. వివిధ వేషధారణలు, ఆటపాటలు, నృత్యాలతో పరిగి పట్టణంలోని ప్రధానవీధుల గుండా భారీగా ఊరేగింపు నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ జి.రంజిత్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ తదితరులు ఫలహారం బండి ఊరేగింపులో పాల్గొని పూజలు చేశారు.

జిల్లా కేంద్రంలో కనీస వసతులు కరువు

వికారాబాద్, జూలై 25 : జిల్లా కేంద్రంలో కనీస వసతులకు కూడా నోచుకోవడం లేదని వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్ మెంట్ ఫోరం అధ్యక్షుడు కె. శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్లు, డ్రైనేజీ, సిగ్నల్స్ సమస్యలు తీర్చాలని, కుక్కలబెడద నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి, దేవదాసు, విజయ్ కుమార్, మాణిక్ రెడ్డి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయాల ఆధునికీకరణకు కృషి



మేడ్చల్ గ్రంథాలయం తనిఖీలో రియాజ్

మేడ్చల్ టౌన్, జూలై 25: గ్రంథాలయాలను ఆధునికీకరించడానికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ అన్నారు. ఆయన గురువారం మేడ్చల్ గ్రథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దాతలు గ్రంథాలయానికి సమర్పించిన ఫర్నీచర్‌ను ప్రారంబించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ.. పాఠకుల కోసం పుస్తకాలతో పాటు కంప్యూటర్ విభాగాన్ని కూడా మేడ్చల్ గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తామన్నారు. గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని ఇక్కడ విచ్చేసే పాఠకులకు జ్ఞానం ప్రసాదించే పుస్తకాలను సమకూర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రంథాలయాల నిర్వాహణకు చాలా మంది దాతలు ముందుకు వచ్చి విరాళాల రూపకంగా ఫర్నీచర్ ఇతర పరికరాలను తమవంతు సాయంగా సమర్పించుకుంటున్నారన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. పాఠకులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవటంతో పాటు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రశాంత వాతావరణంలో పాఠకులు చదువుకునే వీలు కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రియాజ్ గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, లైబ్రేరియన్, పాఠకులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

మోమిన్‌పేట్, జూలై 25: అనారోగ్యం బారిన పడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, మల్లారెడ్డి, మహేందర్, భాస్కర్, ఏరాజ్‌పాష, ఏజాజ్ పాష, వెంకటయ్య పాల్గొన్నారు.

బంట్వారం(కోట్‌పల్లి): మండలంలోని జిన్నారం, మోత్కుపల్లి, నాగసాన్‌పల్లి గ్రామాల్లో ఆరుగురు లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, మల్లేశం, ప్రభాకర్‌రెడ్డి, అక్బర్, ఖాజా మియ, రాజేందర్ రెడ్డి ఉన్నారు.

మర్పల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 21 మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కలీమోద్దీన్, ఫసియోద్దీన్, రాచన్న, రఫీ, సురేశ్, దివాకర్, మల్‌రెడ్డి, సలీం, పాండురంగారెడ్డి, కృష్ణారెడ్డి, అంజయ్య, నరేశ్, వడ్ల వెంకటేశం, జాఫర్ పాల్గొన్నారు.

సీఎంకు, డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షలు



సీఎం, డిప్యూటీ సీఎంలకు శుభాకాంక్షలు తెలుపుతున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, జూలై 25: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సహచర శాసనసభ్యులతో కలిసి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో వారిరువురిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి, దేవదాసు, విజయ్‌కుమార్, మాణిక్ రెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కొడంగల్ రూరల్:** మండలంలోని దర్మాపూర్ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు గురువారం కొడంగల్‌లో కడా కార్యాలయంలో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

● **తాండూరు:** కౌన్సిలర్ సంగీత అజయ్ కుమార్ ఠాకూర్ ఆధ్వర్యంలో గాంధీ నగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు.

● **మేడ్చల్ టౌన్:** స్థానిక ఎస్ఎస్‌జీ పాఠశాలలో విద్యార్థులు గురువారం బోనాల ఉత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రమేష్, శైలజ హరినాథ్, పాఠశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

● **శామీర్‌పేట:** మాజీ మంత్రి కేటీఆర్ గురువారం రాజీవ్‌రహదారిలో మేడిగడ్డ సందర్శనకు వెళ్తూ మధ్యాహ్నం కాసేపు అలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆగి మధ్యాహ్నం లంచ్ చేశారు. శామీర్‌పేట మండల మాజీ జడ్పీటీసీ అనిత, మాజీ ఎంపీపీ ఎల్లూబాయి, బీఆర్ఎస్ మండల యూత్ నాయకుడు వంగ వెంకట్‌రెడ్డి, నాయకులు ఆయను కలిశారు.

● **కులకచర్ల:** మండలంలో అన్ని రకాల పింఛన్లు తపాల కార్యాలయం ద్వారా సంబంధిత పోస్ట్‌మెన్‌ల ద్వారా పంపిణీ చేస్తుండగా రెండురోజులుగా ఆన్‌లైన్ సర్వర్ పని చేయకపోయింది. ఉన్నతాధికారులు స్పందించి లబ్ధిదారులకు పింఛన్‌లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

● **కులకచర్ల:** ప్రధాన కూడలిలో కూరుకుపోయి అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పారిశుధ్య కార్మికులతో తొలగించారు.

● **కులకచర్ల:** ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాలలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ డెల్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ ఇంప్లిమెంట్‌పై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు.

తాండూరు రూరల్: ఈనెల 28, 29వ తేదీల్లో శ్రీకాళికాదేవి ఆలయం బోనాల జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహణాధికారి టి.నరేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● **తాండూరు రూరల్:** కరన్‌కోట్‌కు చెందిన యువ నాయకుడు బోయ అశోక్ సోదరుడు బోయ శ్రీనివాస్ అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

● **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు ఏఐసీటీఈ వాణి ప్రయోజిత డీప్ లర్నింగ్ ఆరోగ్య సంరక్షణ సదస్సు గురువారం ముగిసింది. కళాశాల కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డీన్ రామసుబ్బారెడ్డి, డాక్టర్ దిలీప్ కుమార్ రెడ్డి, డాక్టర్ జీ.రాము పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** కుక్కల దాడితో గయపడి ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు గగన్ తండాన్‌ను గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన స్థానిక నాయకులు గురువారం పరామర్శించారు.

● **మోమిన్‌పేట్:** దేవరంపల్లి గ్రామానికి చెందిన సర్వే నెం.149లో 4 ఎకరాల 6 గుంటల భూమిపై హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు కన్నేసి ఆ భూమి తాము కొనుగోలు చేశామని దౌర్జన్యం చేస్తున్నారని కర్రోళ్ల సత్యమ్మ, కర్రోళ్ల నర్సింహులు, యేసమ్మ, పార్వతమ్మ, బాలమణి, వెంకటయ్య గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

● **పరిగి:** విద్యార్థుల్లో ప్రతిభను చాటేందుకు ప్రోత్సహకాలు అందిజేస్తామని న్యూబ్రిల్లియంట్ స్కూల్ చైర్మన్ కె.హన్మంత్‌ముదిరాజ్ తెలిపారు. 9.8 సాధించిన పాఠశాలకు చెందిన టెన్త్ విద్యార్థి సామల ప్రణితను ఘనంగా సన్మానించారు.

● **పరిగి:** సయ్యద్‌మల్కాపూర్ పాఠశాలలో పనిచేస్తూ పదిలీపై వెళ్లిన రుక్మిణి, శ్యాంసుందర్‌లను నోడల్ అధికారి గోపాల్ గురువారం పాఠశాలలో ఘనంగా వీడ్కోలు పలికారు. వారికి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

● **బషీరాబాద్:** బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ జూనియర్ సూపర్‌వైజర్ రాములు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా అయన మండలానికి బదిలీ కాగా ఇక్కడి నుంచి వెళ్లారు.

● **శామీర్‌పేట:** తూంకుంట పరిధిలోని విశ్వవిశ్వాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల్లో 2024-26 పీజీడీఎం బ్యాచ్ ప్రారంభ వేడుకలను ఆ కళాశాల గ్రూప్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల పీజీడీఎం డైరెక్టర్ డాక్టర్ లక్ష్మణ్‌కుమార్, అసోసియేట్ డీన్ జయశ్రీ, అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు పరిశ్రమ నేతలు పాల్గొన్నారు.

● **దోమ/దౌల్తాబాద్:** వనమహోత్సవంలో భాగంగా గూడూరు, దొంగ ఎన్కెపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణల్లో ఎంపీడీవో మహేశ్‌బాబు గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మాటూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీవో విజయలక్ష్మి గురువారం తనిఖీ చేసి మొక్కలు నాటారు. బషీరాబాద్‌లో ఎంపీడీవో జి.యాదయ్య మొక్కలు నాటారు.

● **కులకచర్ల:** స్థానిక కేజీబీవీలో ఎంపీడీవో రామకృష్ణ గురువారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు.

రైలు ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్



ఏకనాథ్ కాంబ్లే



ఏకనాథ్ కాంబ్లేను కాపాడుతున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

వికారాబాద్, జూలై 25: కదులుతున్న రైలు ఎక్కే క్రమంలో ఓ వ్యక్తి అదుపుతప్పి రైలు కింద పడిపోగా ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ కాపాడాడు. ఈ ఘటన వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం 6.30గంటలకు లాతూరు వెళ్లే ప్రయాణికుడు ఏకనాథ్ కాంబ్లే కదిలిని రైలును ఎక్కేప్రయత్నం చేశాడు. పట్టుతప్పి కింద పడిపోతుండగా అక్కడే విధుల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ రమేష్‌దాసు ఏకనాథ్‌ను పట్టాల కిందకు పోకుండా కాపాడి ప్రాణాలు రక్షించాడు. దీంతో ఏకనాథ్ స్వల్పగాయాలతో ప్రాణాలతో బయట పడినట్లు ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ రాజేందర్ తెలిపారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు

నవాబుపేట, జూలై 25: పోలీస్ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు మండలంలోని సమస్యాత్మక గ్రామాల గురించి పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట్ సీఐ అంజనేయులు, ఎస్‌ఐ భరత్‌భూషణ్ ఉన్నారు.

ఆర్టీసీ తాండూరు డీఎంగా సురేష్ కుమార్

తాండూరు, జూలై 25: ఆర్టీసీ తాండూరు డిపో మేనేజర్‌గా సురేష్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డీఎం మమత హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ డిపోకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఉప్పల్ డిపో నుంచి సురేష్ కుమార్ తాండూరు డిపోకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డిపో ఉద్యోగులు, సిబ్బంది వెల్ఫేర్ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు.

సీఎంఆర్‌లో 'కార్గిల్ దివస్'

మేడ్చల్ టౌన్, జూలై 25: దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికుల కోసం గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 25వ కార్గిల్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి కార్గిల్ అమర వీరులకు నివాళులర్పించి దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికుల కుటుంబాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నమలై, కమాండేంట్ రమేష్, ఏయిర్ కమాండేంట్ వీఎం.రెడ్డి, ఐఏఎస్ అధికారి ఎల్.వీ.సుబ్రమణ్యం, సినిమాటోగ్రఫర్ సెంధిల్ కుమార్, ప్రియాంక ధర్మపురి, శిల్పా, మిస్ఇండియా రన్నర్ అప్ స్వాతికుమార్, సీఎంఆర్ కాలేజీ చైర్మన్ గోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రా రావు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లిలో కుక్కల పట్టివేత

మేడ్చల్ టౌన్, జూలై 25: వీధి కుక్కలు గుంపులుగా చేరి పలు చోట్ల ప్రజలను కరుస్తుడడం, బుధవారం సాయంత్రం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఓ నాలుగేళ్ల చిన్నారిని కుక్కలు కరిచి తీవ్రంగా గాయపర్చిన నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది వీధి కుక్కలను బంధించే కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. గురువారం బ్లూక్రాస్ సంస్థ ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది కలిసి కుక్కలు అధికంగా ఉన్న వార్డుల్లో తిరగి కుక్కలను బంధించారు. ప్రధానంగా లేబర్ కాలనీల్లో కుక్కలు అధికంగా ఉండటంతో అక్కడ తిరిగే కుక్కలను పట్టుకోవడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

ఏడాదిలో 200 రోజులు పని కల్పించాలి

పరిగి, జూలై 25: వ్యవసాయ కార్మికులకు ఏడాదిలో 200 రోజులు ఉపాధి పని కల్పించాలని సీపీఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బాలమల్లేశ్ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిగిలో బీకేఎంయూ, ఏఐవైఎఫ్ కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అనేక మార్పులు తీసుకొచ్చి పూర్తిగా ఎత్తివేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, నాయకులు శ్రీమన్, పీర్‌మహ్మద్, ఎం.వెంకటేశ్, చీమల బిచ్చన్న, రాచంద్రయ్య, రాములు, రవినాయక్ పాల్గొన్నారు.